RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 76 | ఫిబ్రవరి 8, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379




## వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా అవసరం

**టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత ప్రమాద బీమా పత్రాలు అందజేసిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తం గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ టీఎస్ జేయు యూనియన్ సభ్యులందరికీ ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అందజేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బీమా పత్రాలను జిల్లా కలెక్టర్ సత్య శారదా చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. టీఎస్ జెయు ఆధ్వర్యంలో జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం నిజంగా అభినందించదగ్గ విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, జిల్లా అధ్యక్షులు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, బత్తుల సత్యం, వల్లేపు భాగ్య రాజు,కార్యవర్గ సభ్యులు కౌడగాని మోహన్ రావు, నీరుటి శ్రీహరి, అడుప అశోక్, మంతెన సురేష్, అవినాష్, బొక్క రాజు తదితరులు పాల్గొన్నారు.



## దేవుని భూములకే ఎసరు..!

- అన్యాక్రాంతమవుతున్న మెట్టుగుట్ట టెంపుల్ ల్యాండ్స్
- ఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదంటున్న స్థానికులు

**వేద న్యూస్, కాజీపేట:**

స్వయం భూ దక్షిణ కాశీ, హరిహర క్షేత్రంగా విరాజిల్లుతున్న మెట్టుగుట్ట రామలింగేశ్వర స్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థాన భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో మెట్టుగుట్టకు సంబంధించిన టెంపుల్ ల్యాండ్స్ కబ్జాకు గురి కావడంతో, సంబంధిత ప్రభుత్వ అధికారులతో సర్వేలు నిర్వహించి హద్దులు సరిచేశారు. అయితే, ఆలయ భూముల రికార్డులు సరికాకముందే మళ్లీ కబ్జా చేసి హద్దులను దాటి, అందులో అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. ఈ విషయమై స్థానికంగా నివసిస్తున్న పల్లపు మల్లికార్జున్ మెట్టుగుట్ట ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. కాగా, కంప్లయింట్ చేసినా పట్టించుకోవట్లేదని, చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని మల్లికార్జున్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎంతోమంది అక్రమ నిర్మాణాలు చేపడుతుండటంతో దేవుని భూముల అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, మెట్టుగుట్ట ఆలయ భూములు కాపాడాల్సిన బాధ్యత ఆలయ అధికారులు, ప్రభుత్వ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఆలయ అధికారులు పట్టించుకోకపోతే దీనిపై దేవాలయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.



## రేషన్ కార్డులేని వారికి శుభవార్త

- మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం

**వేద న్యూస్, డెస్క్:**

రేషన్ కార్డులు లేని నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ప్రజలకు ఊరటనిచ్చింది. లబ్ధిదారుల నుంచి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించాలని మీసేవ కమిషనర్‌ను పౌరసరఫరాల శాఖ కోరింది. రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇదివరకే విడుదల చేసింది. ఇదిలా ఉండగా, కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డుల్లో మార్పులు, చిరునామా మార్పులు, ఇతర వివరాల నవీకరణలను కూడా ఆన్‌లైన్ ద్వారా సులభంగా చేసుకునే వెసులుబాటును కల్పించింది. కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, దీనికి నిర్దిష్టమైన గడువు అంటూ ఏమీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డును అందిస్తామని తెలిపింది.

## రాంపూర్ డంప్ యార్డ్‌లో పొగ నియంత్రణకు చర్యలు

**'వేద న్యూస్' తెలుగు దినపత్రిక కథనానికి స్పందన**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



RNI No :TELTEL2022/83073

వేద న్యూస్

నెలకు రెండు ప్రాణాలు

'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో ప్రకటించిన కథనానికి స్పందన లభించింది. వేద న్యూస్ తెలుగు దినపత్రిక గత నెలలో 'నెలకు రెండు ప్రాణాలు'అనే శీర్షికతో రాంపూర్ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడే పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రచురించింది. ఈ కథనానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్పందించారు.

రాంపూర్ డంప్ యార్డ్‌లో పొగనియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నేడొక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాల నుండి వెలువడే అగ్ని, పొగ, ధూళి, ఉద్గారాలను ఆర్పివేయడానికి వ్యర్థాలపై నీటిని చల్లుతూ తక్షణ ఉపశమనంగా పొగ వాయువులు దుర్వాసన రాకుండా ఉద్గారాలను నిరోధిస్తున్నామని పేర్కొన్నారు. కాజీపేటలోని ఫిల్లింగ్ స్టేషన్ నుండి డంప్‌యార్డ్ ప్రదేశానికి సమయాన్ని ప్రయాణాన్ని తగ్గించడానికి, డంప్ యార్డ్ వద్ద ప్రత్యేకంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డంపింగ్ యార్డు వద్ద ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ నీటి లభ్యతను అందుబాటులో ఉంచి వెంటనే నీటిని చల్లడానికి ఏర్పాటు చేశామని అన్నారు. స్వల్పకాలిక ఉపశమన చర్యలలో భాగంగా పచ్చదనాన్ని ఏర్పాటు చేయడం, బయో మైనింగ్ ప్రక్రియ లో భాగంగా ట్రీట్ చేయబడిన లెగసీ వ్యర్థాల ద్వారా భూమిని పునరుద్ధరించడం, డంపింగ్ వాహనాలు,ట్యాంకర్ల కదలికను సులభతరం చేయడానికి బ్లాక్‌లు, జోన్‌లలో అంతర్గత రోడ్లను ప్రణాళికాబద్ధంగా వేయడం వల్ల వ్యర్థాల నిర్వహణలో రాబోయే వ్యర్థాలను సరిగ్గా డంపింగ్ చేయడం జరుగుతున్నదని అన్నారు .

అదనపు బయో మైనింగ్ ద్వారా రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటికే ఉన్న బయో-మైనింగ్ ప్రాజెక్ట్ నుండి విడుదలయ్యే వ్యర్థాలను ప్రోసెస్ చేయడం మంచి ఫలితాన్ని అందించాయని బల్దియా ఎంపిక చేసిన ప్రదేశాలలో అదనపు డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్లు (డిఆర్‌సిసి)ని ఏర్పాటు చేయడం వల్ల రాంపూర్ డంపింగ్ యార్డ్‌కు పొడి వ్యర్థాలు వెళ్లే పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో లోడ్‌ను తగ్గింపుతో పాటు అగ్ని ఉద్గారాలను తగ్గిస్తు న్నామని మూల వ్యర్థాల నుండి వ్యర్థాలను వేరు చేసే పద్ధతిలో అంటే తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించడానికి చర్యలు ప్రారంభించామని తెలిపారు. డిఆర్‌సిసి, బయో కంపోస్ట్, వర్మి-కంపోస్ట్ వంటి సంబంధిత ప్రాసెసింగ్ ప్లాంట్‌లకు అంత్య వ్యర్థాలు రవాణా చేయబడుతున్నాయన్నారు. రాంపూర్ డంప్ యార్డ్‌లో వ్యర్థాల నుండి ఇంధన ప్లాంట్లు, సిఅండ్ డి వ్యర్థాల ప్లాంట్లు, బయో-మెథనైజేషన్ ప్లాంట్ల ఏర్పాటు భారాన్ని తగ్గిస్తాయని తెలిపారు. తడి, పొడి చెత్తను సేకరించడానికి, రవాణా చేయడానికి తగినన్ని వాహనాలు కొనుగోలు చేస్తున్నామని కమిషనర్ వివరించారు.

## వివాహితపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జరిమానా

**వేద న్యూస్, కాజీపేట :**



గ్రేటర్ వరంగల్ నగరం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపెల్లి గ్రామానికి చెందిన వివాహితపై 09మే2015లో మహిళ తన ఇంటి వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన పోలెపాక రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించడాని చేసిన ఫిర్యాదులో అప్పటి ఎస్సైనాగేశ్వర్ రావు కోర్టులో ఛార్జిషీట్ దాకలు చేశారు. కోర్టు విచారణలో భాగంగా కోర్టు కానిస్టేబుల్ రాజేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరపున ఎస్.దుర్గబాయ్ వాదించారు. నిందితుడిపై నేరం రుజువు అయినందున హన్మకొండ మొదటి అదనపు నాయమూర్తి చింతాడ శ్రావణ స్వాతి రూ.5000 జరిమానా విందించారని, జరిమానా కట్టనిచో నెల రోజుల జైలు శిక్ష పడుతుందని తెలిపినట్లు మడికొండ సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు లైసన్ ఆఫీసర్ పరమేశ్వరి, మడికొండ ఎస్సై రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## 10మంది నకిలీ వైద్యులపై కేసు నమోదు

- తెలంగాణ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ లేకుండా అల్లోపతి వైద్యం చేయరాదు..!
- టీజీఎంసీ వైస్ చైర్మన్ డా.జి.శ్రీనివాస్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో గత నెలలో తనిఖీలు నిర్వహించిన తెలంగాణ వైద్య మండలి అధికారులు 10 మంది నకిలీ వైద్యులను గుర్తించి శుక్రవారం ఎన్ఎంసి చట్టం 34,54 ప్రకారం కేసులు నమోదు చేశారు.సదరు నకిలీ వైద్యులు ఆర్ఎంపి, పిఎంపి అని బోర్డులు ఏర్పాటు చేసి తమ వద్దకు వచ్చే అమాయక రోగులకి ఆశాస్త్రియంగా అవసరం లేని ఆంటిబయోటిక్, స్టేరాయిడ్ మందులను ఇస్తునట్టుగా అధికారులు గుర్తించి ఆధారాలు సేకరించారు.తెలంగాణ వైద్య మండలి వైస్ చైర్మన్ డా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎంసి, టిఎస్ఎంపిఆర్ చట్ట ప్రకారం తెలంగాణ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరు కూడా అల్లోపతి వైద్యం చేయరాదని అన్నారు. ఆర్ఎంపి,పిఎంపిలు అసలు వైద్యులు కారని వారికి అసలు వైద్యం చేసే ఎటువంటి విద్యార్హతలు లేవని చట్ట వ్యతిరేకంగా అల్లోపతి ప్రాక్టీస్ చేసే ప్రతి నకిలీ వైద్యుడి పైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్, వరంగల్ లాంటి ముఖ్య పట్టణాలపై ఇంకా తనిఖీల సంఖ్య పెంచుతామని ఇకనైనా ఆర్ఎంపి,పిఎంపిల తీరు మార్చు కోవాలని సూచించారు. అలాగే తెలంగాణ వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ లేకుండా వైద్యం నిర్వహించే నకిలీ వైద్యులపైన ఫిర్యాదుల కోసం antiquackerytsmc@onlinetsmc.in మెయిల్ ఐడి ద్వారా లేదా 9154382727 నెంబర్ కు వాట్సాప్ ద్వారా వారు రాసే ప్రెస్క్రిప్షన్, అడ్రస్ తెలియజేయాలని కోరారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంటాయాని టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా వి.నరేష్ కుమార్ అన్నారు.

# నో... నెవర్...వద్దు

హైదారాబాద్ : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు ఖమ్మం, వరంగల్, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాల్లో, ఒక పట్ట భద్రుల స్థానానికి నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ అభ్యర్థులను నిలబెడుతుందా? లేక ఎవరికైనా మద్దతు ఇస్తుందా అనేది చర్చగా మారింది. ఇప్పటి వరకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేదా అనే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో నడుస్తోంది. ఇంతకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వ్యూహం ఏంటి అనేది రాజకీయ వర్గాలకు అంతుపట్టకుండా తయారైంది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోవడంతో పాటు ఏకంగా సగం స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో గులాబీ కేడర్ పూర్తిగా ఢీలపడిపోయింది. ఆ తర్వాత జరిగిన ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోలేకపోయింది. అందుకే త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు పార్టీ పెద్దలు సంకోచిస్తున్నారంట. నాలుగు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం కాంగ్రెస్ పార్టీకి సిట్టింగ్ స్థానంగా ఉంది. గత ఎన్నికల్లో జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిచారు. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉంది. అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థిని నిలబెట్టలేదు. అప్పట్లో వేరే అభ్యర్థికి మద్దతు ఇచ్చింది. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తుంది అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ టికెట్ కోసం నేతలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిలుముల రాకేష్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, ప్రయివేటు విద్యాసంస్థల సంఘం నేత శేఖర్‌రావు టిక్కెట్ ఆశిస్తున్నారు. వారు కేసీఆర్ ను కలిసి తమకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ఇప్పటికే కోరారు. ఇక కరీంనగర్, నిజామాబాద్ , మెదక్, ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి గతంలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పాతూరి సుధాకర్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అధికారంలో ఉన్నప్పుడే ఓడిపోయిన ఆ స్థానం నుంచి ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థి



రంగంలోకి దిగడం అనుమానమే అంటున్నారు. ఖమ్మం, వరంగల్ , నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో పిఆర్‌టియూ నుండి గెలిచిన పూల రవీందర్ బీఆర్ఎస్‌లో చేరారు. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ నుండి పోటీ చేసిన పూల రవీందర్ పరాజయం పాలయ్యారు. దాంతో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థులను నిలబెడుతుందా లేదా అన్నది క్లారిటీ లేకుండా పోయింది. ఎన్నికల్లో పోటీపై గులాబీ పార్టీ ముఖ్య నేతలు సైలెంట్ గా ఉంటున్నారు. బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ సైతం తమ అభ్యర్థులపై కసరత్తులు చేస్తోంది. మెదక్ , కరీంనగర్ , నిజామాబాద్ , ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ అభ్యర్థిని ప్రకటించింది .. ఇక కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. కవిత ఎమ్మెల్సీగా అక్కడ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా ఈ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ సంశయిస్తుండటం ఆ పార్టీ దైన్య స్థితికి అద్దం పడుతోందంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయిందని బీఆర్ఎస్ ఉదరగొడుతుంది. అయినా ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో.. కేసీఆర్ వ్యవహా శైలిలో ఇంక మర్పురాలేదని, అదే ఒంటెద్దు పోకడ పోతున్నారని గులాబీ శ్రేణులు గుర్రుగా కనిపిస్తున్నాయి.

# న్యూడ్ వీడియోల కోసం యాప్..

## - మస్తాన్ సాయి దగ్గర పెద్ద ఎత్తున అమ్మాయిల క్లిప్స్





హైదరాబాద్ : యువతులను ట్రాప్ చేసి.. ప్రైవేటు వీడియోలతో బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన మస్తాన్ సాయి భాగోతాలు హార్డ్ డిస్కుల కొద్దీ బయటపడుతున్నాయి. హీరో రాజ్ తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మస్తాన్ సాయిని అరెస్టు చేసిన బాచుపల్లి పోలీసులు.. రిమాండ్ రిపోర్టు సమర్పించారు. ఈ రిపోర్టులో మస్తాన్ సాయి అరాచకాల చిట్టా మొత్తం బయటపెట్టారు పోలీసులు. లావణ్య ఫిర్యాదు చేసినట్టుగా ఆమెను హతమార్చేందుకు మస్తాన్ సాయి ప్లాన్ చేసినట్టుగా పోలీసులు నిర్ధారించారు. మస్తాన్ సాయి, అతడి స్నేహితుడు ఖాజాకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్టుగా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. డ్రగ్స్ తీసుకుని ఆ మత్తులోనే లావణ్య ఇంటికి వెళ్లిన మస్తాన్ సాయి.. వివాదం సృష్టించినట్టు పేర్కొన్న పోలీసులు.. ఎన్డీపీఎస్ సెక్షన్‌ను కూడా జోడించారు. మస్తాన్ సాయి ల్యాప్‌టాప్‌లో ఉన్న లావణ్య వ్యక్తిగత వీడియోలను నటుడు రాజ్‌తరుణ్ గతంలోనే తొలగించగా.. అంతకు ముందే ఆ వీడియోలను ఇతర డివైస్‌లలోకి మస్తాన్ సాయి కాపీ చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. లావణ్యను పలుమార్లు మర్డర్ చేయడానికి మస్తాన్ సాయి యత్నించినట్టుగా విచారణలో వెల్లడైంది. లావణ్య వద్ద ఉన్న హార్డ్ డిస్క్ కోసం ఆమెను చంపేందుకు మస్తాన్ సాయి ప్లాన్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జనవరి 30వ తేదీన లావణ్య ఇంటికి వెళ్లి చంపేందుకు ప్రయత్నించినట్టు వెల్లడించారు. పోలీసుల దర్యాప్తులో మస్తాన్ సాయి భాగోతాలు బాగానే బయటపడ్డాయి. వీకెండ్స్‌లో తన విల్లాలో భారీగా డ్రగ్స్ పార్టీలు నిర్వహించేవాడు. ఆ పార్టీలకు అమ్మాయిలను పిలిచి.. వారికి డ్రగ్స్ ఇచ్చేవాడు. అమ్మాయిలు డ్రగ్స్, గంజాయిలాంటి మత్తు పదార్థాలు తీసుకుంటున్న సమయంలోనే వీడియోలు రికార్డ్ చేసేవాడు. అమ్మాయిలు మత్తులోకి జారుకున్న తరువాత వారిపై మస్తాన్ సాయి లైంగిక దాడి చేసేవాడు. ఆ సమయంలో వీడియోలు రికార్డు చేసేవాడు. పోలీసులకు అలాంటి వీడియోలు సెల్‌ఫోన్లు, హార్డ్ డిస్కుల్లో కుప్పలు తెప్పలుగా దొరికాయి. మస్తాన్ సాయి సెల్ ఫోన్, హార్డ్ డిస్కులపై ఎఫ్ఎస్ఎల్ బృందం ఇంకా దర్యాప్తు చేస్తోంది. ఫిబ్రవరి 3వ తేదీన లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు. నటుడు రాజ్‌తరుణ్ తనతో విడిపోవడానికి మస్తాన్ సాయి ప్రధాన కారణమని లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మస్తాన్ సాయి పలువురు అమ్మాయిల వ్యక్తిగత వీడియోలు చిత్రీకరించినట్టు ఆరోపించగా.. విచారించిన పోలీసులు.. గుట్టలుగుట్టలుగా అమ్మాయిల నగ్న వీడియోలను గుర్తించారు. ఇందులో లావణ్యకు చెందిన వీడియోలు కూడా సుమారు 40 వరకు ఉన్నట్టు సమాచారం. మస్తాన్ సాయి సోదరి వివాహానికి వెళ్లిన సమయంలో లావణ్య బట్టలు మార్చుకుంటున్న సమయంలో సీక్రెట్‌గా వీడియో తీయగా.. దాన్ని అడ్డం పెట్టుకుని శారీరకంగా మానసికంగా చాలా ఇబ్బందులు పెట్టినట్టు లావణ్య ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాన్ని రాజ్ తరుణ్‌కు కూడా చెప్పినట్టు సమాచారం. స్వయంగా సాఫ్ట్ వేర్ అయిన మస్తాన్ సాయి.. ఈ వీడియోల కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌నే క్రియేట్ చేసినట్టుగా తెలుస్తోంది. మరోవైపు.. లావణ్యతో సహా పలువురు అమ్మాయి ఈమెయిల్స్ హ్యాక్ చేసి.. వారి సీక్రెట్‌లను తెలుసుకుని.. వాటిని అడ్డం పెట్టుకుని అరాచకాలు చేసినట్టుగా తెలుస్తోంది. కాగా.. మస్తాన్ సాయి భాగోతాలు ఇంకా చాలా ఉన్నాయని.. అవన్నీ తానే స్వయంగా చెప్తానంటూ లావణ్య ఇప్పటికే స్టేట్ మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే.

# మంథని మహనీయుల చరిత్రను చాటుదాం

## - విగ్రహాలు,వీధులకు పేర్లు, స్వాగత అర్చీలు పెట్టి గౌరవిద్దాం

## - మంథని మాజీ ఉపసర్పంచ్, న్యాయవాది ఇనుముల సత్యనారాయణ

మంథని : పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలో ప్రజా ప్రతినిధులుగా, స్వాతంత్ర సమర యోధులుగా, నిజాం నవాబు పాలనపై పోరాటం చేసిన వీరులుగా తెలంగాణ ఉద్యమ కారులుగా ఉండి మంథని ప్రాంతానికి సేవ చేసి, మంథని కీర్తిని విశ్వవ్యాప్తం చేసి అమరులైన వారిని పార్టీలకు అతీతంగా పలువురు మహనీయులకు విగ్రహాలు, వారి పేర్లపై పట్టణంలోని పలు వీధులకు, రోడ్లకు నామ పలక బోర్డులు ఏర్పాటు చేసి, వారిని నిత్యం స్మరించే విధంగా మంథని మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరుతూ మంథని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి,స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి మంథని మాజీ ఉపసర్పంచ్, న్యాయవాది ఇనుముల సత్యనారాయణ వినతిపత్రం అందించారు. సందర్భంగా ఇనుముల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ మేరకు చారిత్రక నేపథ్యం కలిగిన మంథని పట్టణం ఎందరో మహనీయుల ను ప్రజలకు అందించిన చరిత్ర ఉందని కాగా గత పాలకులు,స్థానిక సంస్థల పాలకులు ఈ ప్రాంతానికి సంభందం లేనివారిని, మంథని పట్టణానికి సేవలు చేయని వారిని, ఏనాడు ఇక్కడ ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కాని వారి విగ్రహాలు, పలు వీధులకు వారి పేర్లను పెట్టి ఇదే చరిత్ర అని మంథని ప్రజలపై రుద్ది అసలైన మంథని మహనీయుల చరిత్రను మరుగున పడేసిన పరిస్థితి ఇక్కడ నెలకొందని అన్నారు. ప్రస్తుతం మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధతో మంథని పట్టణ అభివృద్ధి కోసం,సుందరీకరణ కోసం మంజూరు చేసిన కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని పలు రోడ్లకు, వీధులకు, పలు కూడళ్ళలో మంథనికి సేవ చేసి, పట్టణ చరిత్రను విశ్వ వ్యాప్తం చేసి అమరులైన మహనీయుల చరిత్రను గుర్తు చేసుకొనే విధంగా వారి విగ్రహాలు, వారి పేర్లపై మున్సిపల్ రికార్థులలో నమోదు చేసి, మున్సిపాలిటీ నిధుల ఖర్చుతో స్వాగత ఆర్చీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని మెజారిటీ ప్రజలు కోరుతున్నట్లు అయిన తెలిపారు. అందుకు గాను మొదటగా మంథని ప్రాంతానికి అనేక ఏండ్లు ప్రాతినిధ్యం వహించి, ప్రజలు మరవని ప్రజానేతగా, అజాత శత్రువుగా పేరుగాంచిన స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు చరిత్రను భావితరాలకు తెలిసే విధంగానే కాకుండా మంథని నియోజకవర్గం ప్రధాన మండలాలకు, కాళేశ్వరం, మహారాష్ట్ర, ఛత్తీస్ ఘడ్ వంటి రాష్ట్రాలకు వెళ్లే వారికి ప్రధాన రహదారిగా ఉన్న మంథని పాత పెట్రోల్ బంక్ కూడలిలో ప్రజానేత చరిత్రను అందరూ తెలుసుకొనే విధంగా,ప్రస్తుతం నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్లతో కూడిన పనులు జరుగుతున్న అట్టి కూడలిని అభివృద్ధి చేసి, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి, అసెంబ్లీ ఎదురుగా ఉన్న జాతిపిత గాంధీ విగ్రహం మాదిరిగా మహనీయుడు స్వర్గీయ శ్రీపాద రావు పెద్ద విగ్రహాన్ని పాత పెట్రోల్ బంక్ కూడలిలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మంథని మున్సిపల్ పరిధిలో ఉండి ఎమ్మెల్యేగా ఎన్నికయిన స్వర్గీయ గడిపెల్లి రాములు , సిఎన్. రెడ్డి, ఎమ్మెల్సీ గా ఎన్నికైన స్వర్గీయ గీట్ల జనార్ధన్ రెడ్డి, స్వాతంత్ర సమర యోధులుగా ఉండి, నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేసిన మహనీయులు స్వర్గీయ గులుకోట శ్రీరాములు , పనకంటి కిషన్ రావు, సువర్ణ ప్రభాకర్, చొప్పకట్ల చంటయ్య, రఘునాథ్ కాచే, మురళీధర్ కాచే, తమ్మనబట్ల దామోదర్ , రాంపెల్లి కిష్టయ్య,మోతేరామ్ గారి రాజేశ్వర్ రావు,సంజీవ్ రావు,ఎలిశెట్టి సీతారామ్, అవధానుల కిష్టయ్య , దేవళ్ళ రాజేశ్వర్ రావు, ఎం. గణపతి , సి. గణపతి



రావు,గట్టు రామన్న, ఎస్. నరసింహులు, వెంకట రాజన్న,నరహరి వంటి మహనీయులను గౌరవించుకోవాల న్నారు. మంథని పట్టణంలో ప్రజా ప్రతినిధులు గా ఎన్నికయిన బయ్యగారి విఠల్, ముక్కా వీర రాఘవులు, కొమురవెల్లి మహాదేవ్, దొంతుల రాజలింగయ్య ,అంబేద్కర్ నగర్ కు చెందిన వేల్పుల రాజయ్య, విశ్వ బ్రాహ్మణ వీధికి చెందిన జంబోజు రాజయ్య, పట్టాణానికి చెందిన గొబ్బూరి సత్యం రాజ్ , మాదాసి రాములు , సిలివేరి రాజయ్య , కవి తాటికొండ రాజయ్య గౌడ్ , తాటి వెంకటి , వొడ్నాల నమ్మయ్య, బోయిని శంకరయ్య , నక్క బలరామ్, తెలంగాణ అమరుడు గుండా నాగరాజు ,మంథని మాజీ వార్డుసభ్యులు వినోద్ కుమార్ జావర్ (లడ్డు బాయ్ ), ఉప్పట్ల సత్యం,సామాజికవేత్తలు అశోక్ కుమార్ నాయుడు,బాపు గౌడ్ వంటి వారి చరిత్రలు మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# అభయహస్తం కాదు, భస్మాసుర హస్తం

హైదరాబాద్ : లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని గ్రామసభలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ములుగు జిల్లా, బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య (నాగేశ్వర్ రావు) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖం చాటేస్తే, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పింది బిఆర్ఎస్ పార్టీ. నాగయ్యకు మంచి వైద్యం అందించి, ప్రాణాలు కాపాడేందుకు ములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ ఎంతో ప్రయత్నించింది. కానీ దురదృష్టవశాత్తు నాగయ్య ప్రాణాలు వదిలారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.

తన చావుతోనైనా అర్హులైన పేదలకు పథకాలు ఇవ్వాలని అధికారులకు చెబుతూ పురుగుల మందు తాగి, ఆసుపత్రి పాలైన నాగయ్య దుస్థితికి ప్రభుత్వమే కారణం. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య. ఉన్నదాంతో కుటుంబాన్ని పోషిస్తూ జీవితం గడుపుతున్న నాగయ్య కుటుంబంలో గ్రామ సభల పేరిట నిప్పులు పోసింది కాంగ్రెస్ ప్రభుత్వం. భర్తను, తండ్రిని కోల్పోయి కన్నీరు మున్నీరు అవుతున్న భార్య, ముగ్గురు ఆడబిడ్డలను ఎవరు ఆదుకోవాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావతో, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరపకుండా, జాబితా విడుదల చేస్తూ ప్రజల్లో గందరగోళం రేపింది కాంగ్రెస్ పార్టీ. దీంతో పాటు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు అంటూ బాహాటంగా ప్రకటించడంతో గ్రామ సభల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పట్ల ప్రజల్లో ఆందోళన మొదలైంది. దరఖాస్తుల పేరిట దగా చేయడం తప్ప, ఏడాది పాలనలో మీరు చేసిందేముంది. గ్రామ సభల సాక్షిగా తిరగబడ్డ జనం, ఎక్కడిక్కడ నిలదీసిన దృశ్యాలు.. మీ 14 నెలల పాలన వైఫల్యాన్ని ఎత్తి చూపాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పాలిట అభయహస్తం కాదు, భస్మాసుర హస్తం. రోడ్డున పడ్డ నాగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రజలారా.. ఆత్మహత్యలు పరిష్కారం కాదు.

నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీపై కొట్లాడుదాం. హక్కుగా రావాల్సిన పథకాలను సాధించుకుందాం. బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. ధైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని రాష్ట్ర ప్రజలకు పిలుపునిస్తున్నామని అన్నారు.

## రెసిడెన్షియల్ స్కూలు మరియు జూనియర్ కళాశాల

# సందర్శించిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట : కొండపాక మండలంలోని దుద్దెడ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాల బాలురు.. కొండపాక లో ఉన్న జగదేవపూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్.. జూనియర్ కళాశాల బాలికలు.. మరియు కొండపాక మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ఆకస్మికంగా సందర్శించి ఆయా హాస్టల్లో భోజనం, వసతి మరియు విద్యా సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా దుద్దెడ టీజీడబ్ల్యూ ఆర్ఎస్ జెసి ని సందర్శించి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులతో వార్షిక పరీక్షల ప్రిపరేషన్ గురించి వాకబ్ చేశారు. మార్చి 6 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున 100% ఉత్తీర్ణత సాధించాలంటే అన్ని సబ్జెక్టులను రిపీటెడ్ గా చదవాలని అన్నారు. ముఖ్యంగా ఈజీగా అర్థమయ్యే సబ్జెక్టులను ప్రాక్టీస్ చేస్తూ కఠిన తరమైన సబ్జెక్టులను అర్థం చేసుకోవడంలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు మంచిగా రాసేలా స్లిప్ టెస్ట్ లు ఎక్కువ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటగదిని హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆకుకూరలు అధికంగా ఉండేలా మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ కృష్ణను ఆదేశించారు. టీజీడబ్ల్యూఆర్ఎస్,జేసీ బాలికల గురుకుల విద్యాలయంలో వంటగది, స్టోరేజ్ రూములను పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని, ఎక్స్పైరీ దగ్గర పడ్డ వంట సరుకులను వాడ రాదని, ఏదైనా సమస్య ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్ సవితను ఆదేశించారు. అనంతరం బీసీ గర్ల్స్ హాస్టల్ లో విద్యార్థినిల లివింగ్ రూమ్స్ పరిశీలించి పైకప్పుకు పెయింట్స్ వేయించుకోవాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులు వివిధ స్కూళ్లకు చదువుకోవడానికి వెళుతున్నందున వారి సెక్యూరిటీగా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ను ఆదేశించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టల్లో ప్రభుత్వం కామన్ డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించుటకు మరియు పెంచిన డైట్ చార్జీలు మరియు కాస్మెటిక్ చార్జీల ప్రకారం విద్యార్థులకు అవి సక్రమంగా అందుతున్నాయో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని అన్నారు. ఎక్స్పైరీ డేట్ దాటిన సరుకులను వాడ రాదని వాటి స్థానంలో ఫ్రెష్ సరుకులను వాడాలని చెప్పడం జరిగింది, బియ్యం కు సంబంధించి అవసరమైతే సివిల్ సప్లై ద్వారా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రభుత్వం కల్పించిన కనీస అవసరాలు అన్ని గురుకులాలు, హాస్టల్లో విద్యార్థులకు లభించేలా పర్యవేక్షణ చేస్తున్నామని, పదవ తరగతి పరీక్షలలో 100% ఉత్తీర్ణత 10/10 జీపి సాధించేలా ఫోకస్ పెట్టేలా పర్యవేక్షణ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించడం జరిగింది అని అన్నారు. కలెక్టర్ వెంటా తాసిల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

# షెడ్యూలే తరువాయి..

## - పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం

హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో ఎన్నికల నిర్వహణకు షెడ్యుల్ రిలీజ్ అయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే పూర్తి చేయడంతో ఇందుకు బలం చేకూరుస్తోంది. షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు ఆఫీసర్ల బృందం ఏర్పాట్లను స్పీడప్ చేస్తోంది.

12 విభాగాలుగా విభజన:

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను నియమిస్తున్నారు. మ్యాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్స్ మేనేజ్మెంట్, రవాణా, శిక్షణ, సామగ్రి మేనేజ్మెంట్, ఎంసీఎంసీ మేనేజ్మెంట్, ఎక్స్పెండీచర్ అకౌంట్స్, ఎక్స్పెండీచర్ మానిటరింగ్ మేనేజ్మెంట్, ఎన్నికల పరిశీలకులు, బ్యాలెట్ పేపర్ మేనేజ్మెంట్, మీడియా మేనేజ్మెంట్, హెల్ప్ లైన్ గ్రీవెన్స్, రిపోర్ట్స్ రిటన్స్ మేనేజ్మెంట్ అని 12 విభాగాలు పనిచేస్తాయి. ఒక్కొక్క విభాగానికో ఒక్కో జిల్లా ఆఫీసర్ను నియమించారు. ఇందులో డీపీవో, డీపీఆర్వో, డీటీవో, డీఈవో, డీఆర్డీవో తదితరులుఉన్నారు.

బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు:

జీపీ ఎలక్షన్లు బ్యాలెట్ పద్ధతిన నిర్వహించనుండటంతో ఆయా జిల్లాల్లో బ్యాలెట్ పేపర్లుముద్రణకు కలెక్టర్లు ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు టెండర్లుపిలవగా.. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే టెండర్లు పూర్తి అయి, ప్రింటింగ్ పూర్తి అయ్యింది. దీంతో ఆ జిల్లాల్లో ప్రస్తుతం బ్యాలెట్ పేపర్లను జీపీలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు గాను ఏ జీపీలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో. అన్ని బ్యాలెట్ పేపర్లకు సీరియల్ వైజ్గా నంబరింగ్ వేస్తున్నారు. ఈ నంబరింగ్ పూర్తి కాగానే.. పోలింగ్ స్టేషన్ల వారీగా బ్యాలెట్ పేపర్లను పంపిణీ చేయనున్నారు.

మార్పులు.. చేర్పులు: గతేడాది నంబరులో ఎలక్షన్ కమిషన్ పంచాయతీ ఓటర్ లిస్టును రిలీజ్ చేసింది. ఆ లిస్టును పంచాయతీ సిబ్బంది ఆయా జీపీ నోటీసు బోర్డుల వద్ద అతికించారు. అయితే మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడంతో చాలా మంది తమ ఓటు ఎక్కడుందనే విషయాలను తెలుసుకుంటున్నారు. ఓ వార్డులో నివాసం ఉండి మరో వార్డులో ఓటరు జాబితాలో పేరు వస్తే వాటికి సిబ్బంది సరి చేస్తున్నారు. ఇంటి పేర్లు, వయస్సు, తండ్రి పేర్లు తప్పుడగా పడితే, పంచాయతీ సిబ్బందికి చెప్పి వాటిని సరి చేయించుకుంటున్నారు. నోడల్ ఆఫీసర్లు కూడా గ్రామాలను విజిట్ చేస్తున్నారు. ఓటర్లు లిస్టు, పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్నారు.

# మారుతి సుజుకి మొదటి ఎలక్ట్రిక్ కార్ లాంచ్

హైదరాబాద్ : అద్భుతమైన 500 ప్లస్ మైలేజ్ రేంజ్ తో తమ మొదటి ఎలక్ట్రిక్ కార్ ఈ విటారాను లాంచ్ చేసిన మారుతి సుజుకి. బంజారా హిల్స్ నెక్స షో రూమ్ లో మారుతి కమర్షియల్ బిజినెస్ హెడ్ వినీత్ జైన్, రీజినల్ మేనేజర్ అమిత్ కుమార్ తో కలిసి తమ మొదటి ఎలక్ట్రిక్ కారును లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు మారుతీ లో కేవలం పెట్రోల్ సిఎన్జి వాహనాలు ఉండటమే అందరికీ తెలుసు కానీ తమ కస్టమర్ల ఆకాంక్ష మేరకు ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తున్న తమ మొదటి ఎలక్ట్రిక్ వెహికల్ ఈ విటారాను రెండు వేరియేషన్స్ తో 500 ప్లస్ మైలేజ్ తో మార్కెట్లోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈనెల భారత మొబిలిటీ ఎక్స్ పోలో ఢిల్లీ వేదికగా ఈ కారు లాంచ్ చేసామని అన్నారు. ఈరోజు హైదరాబాదులో ఈ కార్ ను తమ కస్టమర్లకు అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది అని తెలిపారు. దేశవ్యాప్తంగా మారుతికి ఉన్న అతి పెద్ద నెట్వర్క్ కారణంగా ఈ ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్, మెయింటెనెన్స్ విషయంలో తమ కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాము సేవలు అందించనున్నామని అన్నారు. మారుతి అంటేనే అతి తక్కువ మెయింటెనెన్స్ తో నడిచే వాహనాలు అని ఇప్పటికే తమ కస్టమర్లలో మంచి పేరు ఉన్న కారణంగా ఇప్పటికే బుకింగ్స్ అధిక సంఖ్యలో వస్తున్నాయని ఈ ఎలక్ట్రిక్ వాహనాలు బుకింగ్ చేసుకునే కస్టమర్లు ఏప్రిల్ మొదటి వారం నుండి వారికి వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ కార్ లాంచ్ సందర్భంగా ప్రముఖ క్యాబ్ సంస్థ మొట్టమొదటిగా 28 వాహనాలు బుకింగ్ చేయడం జరిగింది అని వాటిని ఈరోజు విజయవంతంగా వారికి డెలివరీ కూడా చేస్తున్నట్టు తెలిపారు.

వేద న్యూస్



## 48 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు

పల్నాడు : మార్చి 01 నుంచి 20వ తేదీ వరకూ పల్నాడు జిల్లాలో 48 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ రాత పరీక్షలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు బుధవారం వెల్లడించారు.ఎస్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 17,905 మంది ఫస్ట్ ఇయర్ విద్యార్థులు, 14,529 మంది సెకండ్ ఇయర్ విద్యార్థులు కలిపి మొత్తం 32,434 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారన్నారు. వీరితో పాటూ మరో 2117 మంది విద్యార్థులుమార్చి 03 నుంచి 15 వరకూ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాయనున్నారన్నారు. 9 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్ అసిస్టెంట్ ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ పరీక్షా కేంద్రానికి అయినా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్వోను ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ ప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మురళి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నీలావతి దేవి, డీఈవో చంద్రకళ, డీఎంహెచ్ఓ రవి, నరసరావు పేట మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన హోంగార్డుల కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన పోలీస్ కమిషనర్

విజయవాడ : విజయవాడ నగరంలో పనిచేస్తున్న హోంగార్డులలో ఎవరైనా మరణించిన లేక పదవీ విరమణ చేసిన వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చేయడానికి నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే వేతనం నుండి సదరు చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న విషయం విదితమే. ఈ సందర్భంగా హోంగార్డ్ (హెచ్.జి. నెం 07) కె నాగేశ్వరావు విజయవాడ నగర హోంగార్డు యూనిట్ లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించారు. అయన కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 5 లక్షల నగదు చెక్కును గురువారం నాడు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు నాగేశ్వరావు భార్య కి అందజేసారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి. సి. పి. కె. జి. వి. సరిత, హోంగార్డు ఆర్.ఐ. కె.సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత ఫోటోలు మార్ఫింగ్ చేస్తున్నారు

హైదరాబాద్ : సోషల్ మీడియాలో ఎమ్మెల్సీ కవిత ఫోటోలు మార్ఫింగ్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి ఉ స్మానియా యూనివర్సిటీ స్టూడెంట్ ఫెడరేషన్ హైద్రాబాద్,సైబర్ క్రైం పోలీసులకు పిర్యాదు చేసింది. తెలంగాణ జాగృతి నాయకురాలు,ఎమ్మెల్సీ కవితపై గత కొంతకాలంగా సోషల్ మీడియాలో నిజామాబాద్ ఎంపీ అరవింద్ అనుచరులు కవిత ఫోటో మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఒక మహిళా పై ఇలాంటి దుష్ప్రచారం జరుగుతుందని సైబర్ క్రైం లో పిర్యాదు చేస్తే కనీసం పిర్యాదు కూడా తీసుకోకుండా పోలీసులు వివక్ష చూపిస్తున్నారని తెలంగాణ జాగృతి ఉస్మానియా యూనివర్సిటీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గౌడెల్లి.చెంద్రశేకర్ మండిపడ్డారు. బిజెపి,కాంగ్రెస్ చీకటి ఒప్పందంతో బిఆరెస్ పై కావాలని ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.పోలీసులు ఒకే పక్షాన వ్యవహరించడం సరికాదని ఆరోపించారు.సైబర్ క్రైం లో కేసు తీసుకోకపోయిన కోర్టు ద్వారా నిందుతులపై చర్యలు తీసుకునేవిధంగా పోరాడుతామని అన్నారు.అరవింద్ ఇలాంటి చిల్లర రాజకీయాలు మనుకోకుంటే జాగృతి విద్యార్థులు నిన్ను తిరగనియకుండా అడ్డుకుంటామని చెంద్ర శేఖర్ హెచ్చరించారు.

## బాపట్లలో ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ రాజు ప్రచారం

బాపట్ల : ఉమ్మడి గుంటూరు - కృష్ణ జిల్లాల ఎమ్మెలసీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల పట్టణంలో,బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బాపట్ల మండలం అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, నం దిరాజు తోటి గ్రామ పార్టీ అధ్యక్షులు కందుల బాల కోటేశ్వరరావు, మారీదు వెంకటేశ్వర్లు, సబ్బినేని కిషోర్ మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలకు తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్ యు ను సందర్శించిన అమెరికాకు చెందిన యూనివర్శిటీ బృందం

విజయవాడ : అమెరికాకు చెందిన యూనివర్శిటీ ఆఫ్ మిస్సోరీ-కాన్సాస్ సిటీ, యుఎస్ఎ స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ కెవిన్ జెడ్ ట్రూమాన్ మరియు అంతర్జాతీయ సంభందాల డైరెక్టర్ డాక్టర్ మార్క్ డాలీ, యుఎస్ఎ లోని సౌత్ ఆసియా ఇంటర్నేషనల్ మేనేజర్ దీపికా ఫుకాన్ వారి బృంద సభ్యులు గురువారం నాడు స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీని సందర్శించారు. యూనివర్శిటీ ఆఫ్ మిస్సోరీ-కాన్సాస్ సిటీ, యుఎస్ఎ లోని సౌత్ ఆసియా ఇంటర్నేషనల్ మేనేజర్ దీపికా ఫుకాన్తో అనుబంధించబడిన స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ కెవిన్ జెడ్ ట్రూమాన్ మరియు అంతర్జాతీయ సంభందాల డైరెక్టర్ డాక్టర్ మార్క్ డాలీ, కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీని సందర్శించిన వారిలో ఉన్నారు. అనంతరం వారు కెఎల్ యూనివర్శిటీతో తమ యూనివర్శిటీకి ఉన్న దశాబ్ద కాలం నాటి ఒప్పందాలను మరో ఐదేళ్లకు పొడిగిస్తూ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుని ఒప్పంద పత్రాల పైన ఇరు యూనివర్శిటీల ప్రతినిధులు సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నట్లు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ అంతర్జాతీయ సంభంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు యూనివర్శిటీల బృందాలు కలిసి వివిధ అంశాలపైన జరుపుతున్న పరిశోధనల సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చలు జరిపినట్లు తెలిపారు. తక్షణమే అమలులోకి వచ్చేలా రెండు యూనివర్శిటీల కార్యక్రమాలను ప్రారంభించడం ద్వారా కెఎల్ వర్శిటీలో 2వ లేదా 3వ సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులను అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ మిస్సోరీ-కాన్సాస్ సిటీ, యుఎస్ఎ కు పంపడంతో పాటు అక్కడ చదువుతున్న విద్యార్థులను కెఎల్ యూనివర్శిటీకి పంపడం వంటి విద్యార్థుల మార్పిడి తక్షణమే అమలులోకి వచ్చేలా ఒప్పందం కుదిరిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెఎల్ యు అంతర్జాతీయ సంభందాల డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, డైరెక్టర్ విజయ్ మారుతి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెప్పినట్టే ఉద్యోగాలు ఇస్తాం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి అండగా ఉండాలని కేంద్ర మంత్రులను కోరినట్టు ఏపీ ఐటీశాఖమంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి కేంద్ర మంత్రులకు వివరించానన్నారు. వివిధ శాఖల మంత్రులతో ఆయా సమస్యలపై చర్చించామని, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం చేయాలనికోరినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులపై రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఆరా తీసినట్లు తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన కేంద్రానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారుతమ ప్రభుత్వం 20లక్షల ఉద్యోగాలు ఇస్తామనే హామీకి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ సేవలు, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ విస్తరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పలువురిని కలుస్తామని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు భారీగా తగ్గారని మంత్రి లోకేష్ అన్నారు.

# గజ్వేలు బహిరంగ సభకు 5 లక్షల మంది

హైదారాబాద్ : ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు ఇటీవల జనగామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వచ్చినప్పుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రదర్శించిన ఉత్సాహమిది. అధికారం కోల్పోయాక ఇలాంటి స్టేట్‌మెంట్లు వివిధ సందర్భాల్లో ఇచ్చారు కేసీఆర్. ఇదిగో వస్తున్నా.. అదిగో వస్తున్నా అంటూ గత ఏడాది కాలంగా ఫామ్ హౌస్‌లో నుంచి ప్రకటనలు గుప్పించి కేడర్‌లో ఉత్సాహాన్ని నింపడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆయన బయటకు రాకపోయినా కేటీఆర్, హరీశ్ రావులు ప్రజల్లో ఉంటూ పార్టీ నేతలకు అండగా ఉన్నామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా.. వారి మాటలను పట్టించుకోని కొందరు నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. ఇలా.. బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.ఆ క్రమంలో అధికారం కోల్పోతే ఇక ప్రజలతో, పార్టీతో పనిలేదా అని గులాబీ శ్రేణులే కేసీఆర్‌పై చిర్రుబుర్రులాడుతున్నాయి. కనీసం అసెంబ్లీకి కూడా హాజరుకాకపోతుండటంతో ఇక కేసీఆర్ పనైపోయింది. రాజకీయాల్లో యాక్టివ్ కావటం కష్టమేనన్న అభిప్రాయానికి ఆ పార్టీ నేతలు వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫిబ్రవరి చివరి వారంలో భారీ బహిరంగ సభ పెడతామని ప్రకటించారు. దానికైనా కేసీఆర్ కట్టుబడి ఉంటారా లేదా అని బీఆర్ఎస్ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అయితే వారి అనుమానాలు పటాపంచలు చేస్తూ గులాబీబాస్ నిజంగానే ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చే పనిలో పడ్డారంట. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రభుత్వం కోల్పోయాక తొలిసారి ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టబోతున్నట్లు పార్టీ వర్గాలు నమ్మకంగా చెప్తున్నాయి. ఏడాది పాలన తర్వాత కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాలపై నిలదీసేందుకు ఆయన బయటకు వస్తున్నారంట. బహిరంగసభను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనే నిర్వహించాలని కేసీఆర్ ఫిక్స్ అయ్యారంట. అందుకు తగిన ప్రాంగణం చూడాలని పార్టీ శ్రేణులకు ఆదిశించినట్టు తెలుస్తుంది.అధికారం కోల్పోయాక మాజీ ముఖ్యమంత్రి పాల్గొననున్న గజ్వేలు బహిరంగ సభకు 5 లక్షల మందిని సమీకరించాలి గులాబీపార్టీ టార్గెట్‌గా పెట్టుకుందంట. మెదక్ జిల్లాలోని గజ్వేలు నియోజకవర్గంలో అంతమంది పట్టే సభాస్థలి కోసం పార్టీ వర్గాలు అన్వేషిస్తున్నాయంట. ఇక గజ్వేలులోనే సభ పెట్టడానికి కారణముందంటు న్నారు. 5 లక్షల మందిని సభకు తరలించడం అంటే వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారమే. అదీ ఎలాంటి పొలిటికల్ హడావుడి లేని తరుణంలో అంత మందిని సమీకరించాలంటే తడిసిమోపెడవుతుంది.వేరే చోట ఎక్కడైనా సభ పెడితే జనసమీకరణ కష్ట




సాధ్యమవుతుంది కాబట్టి గజ్వేలునే సెలెక్ట్ చేశారంట. గజ్వేలు ఎమ్మెల్యేగా కేసీఆర్ మూడో సారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు, అది కాక గజ్వేలుని ఆనుకొని ఉన్ని సిద్దిపేట ఎమ్మెల్యేగా మాజీ మంత్రి హరీష్‌రావు ఉన్నారు. దాంతో మామాఅల్లుళు ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్ల నుంచే మెజార్టీ జనాన్ని సమీకరిస్తే .. మిగిలిన ప్రాంతాల నేతలు అటు ఇటుగా వ్యవహరించినా పెద్దగా ఫరక్ పడదన్న ముందుచూపుతోనే గజ్వేలును ఎంపిక చేశారంటఅందుకు అనుగుణంగానే సభ నిర్వహణకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోందట. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యమే అజెండాగా ఈ సభను నిర్వహించాలని కారు పార్టీ భావిస్తోంది. ఇటీవల ఫాంహౌస్‌లో మాట్లాడినప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తీరును తాను ఇన్ని రోజులు మౌనంగా, గంభీరంగా చూస్తున్నానని.. తాను కొడితే మామూలుగా ఉండదని, గట్టిగా కొట్టడం తనకున్న అలవాటని డైలాగ్ వేశారు. తాను పదేళ్ల అధికారంలో ఉండి కూడా పూర్తి చేయలేని ప్రాజెక్టుల గురించి వదిలేసి సంగమేశ్వర, బసవేశ్వర పనులు ఆగిపోయాయన్నారు. ఎస్ఎల్బీసీ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, కూలిన కాళేశ్వరం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేకపోయారు. దాంతో గజ్వేలు సభలో ఆయన ఏ సబ్జెక్టులపై ఫోకస్ పెడతారన్నది ఆసక్తి రేపుతోంది.అదలా ఉంటే ఉన్నట్టుండి కేసీఆర్ బయటకు రావడం. బహిరంగ సభ పెడతాను అనడం వెనక ఉన్న వ్యూహం ఏంటన్నది చర్చనీయాంశంగా మారింది. ఓవైపు పార్టీ ముఖ్యనేతలను కేసులు వెంటాడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలు, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలకు సంబంధించి కేసీఆర్‌కు ఉచ్చు బిగుసుకునే పరిస్థితి కనిపిస్తుంది ? ఇప్పటికే ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. ఢిల్లీ లిక్కర్ కేసు విచారణలో ఉండగానే.. మరో లిక్కర్ స్కామ్‌లో కవిత పేరు వినిపిస్తుంది.. కేరళలో మద్యం కుంభకోణంలో సైతం కవిత ప్రమేయం ఉందని కేరళ కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. పార్టీని నడిపిస్తున్న ముఖ్యనేతలు కేసులు, ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దాంతో అసలే వరుస ఓటముల భారంతో కుంగి పోతున్న కారు పార్టీ క్యాడర్ మరింత ఢీలా పడిపోతుంది. మరోవైపు బ్రేకులు లేకుండా కొనసాగుతున్న వలసలు కార్యకర్తలను మరింత గందరగోళంలోకి నెడుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువైనా ఆశ్చర్యపోనవసరం లేదంటున్నారు. అది దృష్టిలో పెట్టుకునే కేసీఆర్ కాస్త లేట్ అయినా యాక్టివ్ అవ్వాలని చూస్తున్నారంట. పార్టీ లీడర్స్‌ను, క్యాడర్‌ను యాక్టివ్ చేయడానికే కేసీఆర్ బహిరంగసభ ప్లాన్ అనే చర్చ నడుస్తోంది. ఎలాగైనా సరే బహిరంగ సభను సక్సెస్ చేసి పార్టీ శ్రేణుల్లో భరోసా నింపాలని కేసీఆర్ పట్టుదలతో ఉన్నారంట. మరి చూడాలి గజ్వేలు సభతో ఆయనేం సాధిస్తారో?

# రేషన్ కార్డులకు నిబంధనల కిరికిరి

హైదరాబాద్ : తెలంగాణలో గత పదేళ్లుగా రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో...కొత్త రేషన్ కార్డులకు భారీగా అప్లికేషన్లు వస్తున్నాయి. కొత్తగా పెళ్లైన జంటలు రేషన్ కార్డుల కోసం అప్లై చేసుకుంటున్నారు. అయితే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం కాకపోవడం, కొత్త నిబంధనలతో అర్జీదారుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.తెలంగాణలో గత పదేళ్లుగా రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో...కొత్త రేషన్ కార్డులకు భారీగా అప్లికేషన్లు వస్తున్నాయి. కొత్తగా పెళ్లైన జంటలు రేషన్ కార్డుల కోసం అప్లై చేసుకుంటున్నారు. పిల్లల పేర్లు జోడింపు, మరణించిన వారి పేర్లు తొలగింపు..ఇలా రేషన్ కార్డులో మార్పు చేర్పుల కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణతో పాటు జారీ ప్రక్రియ ప్రారంభించింది. జనవరి 26న మండలానికి ఒక గ్రామం చొప్పున కొత్త రేషన్ కార్డులు జారీ చేశారు. ఇక కొత్త రేషన్ కార్డులకు మార్గం సుగుమం అయ్యిందని దరఖాస్తుదారులు భావించారు. అయితే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం కాకపోవడం, కొత్త నిబంధనలతో అర్జీదారుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.కొత్త రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం నూతన నిబంధనలను అమలులోకి తెచ్చింది. 360 డిగ్రీ సాఫ్ట్వేర్ తో రేషన్ కార్డులకు అప్లై చేసుకున్న వారి ఆదాయ వివరాలను ఆధార్ కార్డు సాయంతో స్కాన్ చేస్తున్నారు. దీంతో దరఖాస్తుల ఆదాయ వివరాలు, వారికి కారు ఉన్నా, ప్లాట్లు, ఇళ్లు ఉన్నా స్పష్టంగా తెలుస్తుంది. ఎక్కువ ఆదాయ వనరులు ఉన్న వారి దరఖాస్తులను అధికారులు తిరస్కరణ జాబితాలో పెడుతున్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు... ఆదాయ లెక్కింపు విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు మార్చి అందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఇటీవల మండలానికి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, రైతు భరోసా వంటి పథకాలు అమలుచేశారు.

## దారిలో పెట్టాల్సిందే పోయి ఉపాధ్యాయులు దారి తప్పి కామకీచకులుగా మారారు

### - ఎనిమిదో తరగతి విద్యార్థినిపై టీచర్లు అత్యాచారం

చెన్నై : తప్పు దారిపట్టిన విద్యార్థులను సరైన దారిలో పెట్టాల్సిందే పోయి ఓ ఉపాధ్యాయులు దారి తప్పి కామకీచకులుగా మారారు. విద్యాబుద్ధులు నేర్పి భావి పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన గురువులు దారి తప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థినిపై టీచర్లు అత్యాచారం చేశారు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? కృష్ణగిరి మండలంలోని ఓ గ్రామంలో 13 ఏళ్ల బాలిక ఎనిమిదో తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో చదువుచెబుతున్న ముగ్గురు ఉపాధ్యాయులు బాలికపై కన్నేశారు. ముగ్గురు ఉపాధ్యాయులు బాలికపై అత్యాచారం చేశారు.తరువాత బాలిక నెల రోజుల నుంచి బడికి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు వాళ్ల ఇంటికి వెళ్లాడు. తన కూతురు గర్భం దాల్చిందని తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడికి చెప్పడంతో షాక్‌కు గురయ్యాడు. అబార్షన్ చేయించడానికవ వెళ్తున్నామని చెప్పాడు.

# కులగణనలో శాస్త్రీయత ఎక్కడ



హైదరాబాద్ : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు ఫోన్ చేశారని.. మళ్లీ కలిసి పని చేయాలని పిలిచారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రచారంపై ఈటల రాజేందర్ స్పందిస్తూ.. ఫుల్ క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఈటల తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ తనకు ఫోన్ చేసి పిలిచారంటూ చక్కర్లు కొడుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేశారు. తానంటే గిట్టని వారు.. సోషల్ మీడియాలో ఉండే కొందరు సైకోలు, శాడిస్టులు మాత్రమే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఈటల ఘాటుగా స్పందించారు. ఇందులో ఎలాంటి నిజం లేదని ఈటల రాజేందర్ ఖండించారు.తాను చాలా కాలంగా బీఆర్ఎస్, కేసీఆర్ విషయంలో తన స్పష్టమైన అభిప్రాయాన్ని చెబుతూనే ఉన్నప్పటికీ.. కొంతమంది కావాలనే పనిగట్టుకుని మరీ.. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇది పూర్తిగా బాధ్యత లేని వ్యక్తుల శాడిజమని అభిప్రాయపడ్డారు. తనపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనే త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటనని ఈటల రాజేందర్ హెచ్చరించారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈటల రాజేందర్.. కీలక విషయాలు వెల్లడించారు. మళ్లీ కేసీఆర్ పిలిస్తే వెళ్తారా అంటూ.. జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు ఈటల తనదైన శైలిలో స్పందించారు. తామంతా బాధ్యత ఉన్న రాజకీయ నేతలుగా చెప్పుకొచ్చిన ఈటల.. ఇదేమీ పిల్లల ఆట కాదన్నారు. వాళ్ల పార్టీ వాళ్లది, తమ పార్టీ తమదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావటమే తన లక్ష్యమని ఈటల స్పష్టం చేశారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రోజులో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో సరైన సమాచారం లేదని పేర్కొన్న ఈటల రాజేందర్.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ జరిపిన కులగణనలో కూడా శాస్త్రీయత లేదంటూ విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే బీసీ-ఈ గ్రూప్ తీసుకొచ్చారన్నది తప్పుడు వాదన అని.. నిజానికి అతకుముందే కొన్ని ముస్లిం కులాలు బీసీ-బీ గ్రూప్‌లో ఉన్నాయని ఈటల వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిష్పక్షపాత దృష్టి, చిత్తశుద్ధి, సరైన ప్రణాళిక ఏమీ లేదన్నారు. ఒక కమిషన్ ఏర్పాటు చేసి.. దానికి చట్టబద్ధత కల్పించి, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కులాలను గుర్తించాకే జనగణన చేయాలని ఈటల రాజేందర్ సూచించారు. ఇలాంటివేవీ చేయకుండా కులగణన పేరిట ప్రజలను కాంగ్రెస్ సర్కార్ తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. అవగాహన లేనివారు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని.. ఇది ప్రజలకు ఎటువంటి మేలు చేసే కార్యక్రమం కాదని ఈటల రాజేందర్ అభిప్రాయపడ్డారు.

## రైతు ఖాతాలో రైతు భరోసా నిధులు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం బుధవారము రైతు భరోసా నిధులను విడుదల చేసింది, మండలాల్లో గ్రామాల వారీగా నగదు జమ జరుగుతున్న సంగతి తెలిసిందే, ఒక ఎకరం వరకు సాగులో ఉన్న భూములకు లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసింది, రేవంత్ సర్కార్.జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నాలుగు కొత్త పథకాలను ప్రారంభిం చిన విషయం తెలిసిందే. అందులో రైతు భరోసా పథకం ఒకటి. గణతంత్ర దినోత్సవం నాడు రైతు భరోసా నిధులను ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల ఖాతాల్లోకి రేవంత్ రెడ్డి జమ చేశారు. అయితే, ఆరోజు సెలవు రోజు కావడంతో మరుసటి రోజు రాష్ట్ర ప్రభుత్వం 32 జిల్లాల్లోని 563 గ్రామాల్లో 4,41,911 మంది రైతులకు ఒక్కో ఎకరానికి తొలి విడతగా 6వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. అయితే, మిగిలిన రైతులకు రైతు భరోసా నిధులు జమ కాకపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారు.రాష్ట్రంలో ఎకరం భూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. ఒక ఎకరం వరకు సాగులో ఉన్న భూములకు సంబం ధించి మొత్తం 17.03 లక్షల రైతుల అకౌంట్లకు రైతు భరోసా నిధులు ఇవాళ జమ అవుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.అయితే, ఎకరంకు పైబడి పొలం కలిగిన రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు ఎప్పుడు వస్తాయనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. దశల వారిగా ఎకరం, రెండెకరాలు.. ఐదెకరాలు కలిగిన రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలుస్తుంది.

కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగం, సంక్షేమ రంగాలకు

## నిధులు కేటాయింపులు పెంచాలి

### తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దగ్ధం

కొణిజర్ల : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వ్యవసాయ రంగం సంక్షేమ రంగాలకు అవసరమైన మేరకు నిధులు కేటాయింపులు పెంచాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డపనేని కృష్ణార్జున్ రావు అన్నారు. గురువారం కొణిజర్ల మండలం సింగారయపాలేం లో తెలంగాణ రైతు సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రైతులు వ్యవసాయ రంగం కు ఎరువులు సబ్సిడీ 4 వేల కోట్లు, ఫసల్ భీమా కు మూడు వేల కోట్ల రూపాయలు గంత కంటే కోత పెట్టాడం పై బడ్జెట్ పత్రాలు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డపనేని కృష్ణార్జున్ రావు మాట్లాడుతూ వ్యవసాయ , గ్రామీణాభివృద్ధి, సంక్షేమ రంగాలకు నిధులు కేటాయింపులు తగ్గించి, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ప్రోత్సాహకాలు అందించే విధంగా బడ్జెట్ ఉందని అన్నారు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మిద్దె రామారావు, వడ్లమూడి మధు, రామకృష్ణ మట్టా వెంకటేశ్వరరావు,అనుమోలు వెంకటేశ్వరరావు, బుజ్జి,జాజివేలి, వెంకన్న, నాగులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పు సరే...దిద్దుబాటు ఏదీ?

హైదారాబాద్ : మొన్నామధ్య కాంగ్రెస్ పార్టీ ఒక పోల్ పెట్టింది. తన ట్విట్టర్ ఖాతాలో ఈ పని చేసింది. కానీ ఆ పార్టీ అనుకున్న దానికంటే వ్యతిరేక ఫలితం వచ్చింది. ప్రజా పాలన కంటే ఫామ్హౌస్ పరిపాలనే బాగుందని మెజారిటీ ఓటర్లు అభిప్రాయపడ్డారు. ఇందులో సహేతుకత ఎంత ఉంది? ఇందులో ఎవరు పాల్గొన్నారు? అనే విషయాలను కాస్త పక్కన పెడితే.. ఈ పోల్ ను భారత రాష్ట్ర సమితి అత్యంత తెలివిగా హైజాక్ చేసింది. దేశ విదేశాలను బాట్ లతో కొట్టి పడేసింది.. ఇక్కడే భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా బలాన్ని అంచనా వేయడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విఫలమైంది. ఆ తర్వాత జరగాల్సిన నష్టం జరిగిపోయింది.ఇదే విషయాన్ని కెసిఆర్ ఇటీవల గజ్వేల్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు. నేను కొడితే మామూలుగా ఉండదని కాంగ్రెస్ పార్టీ నాయకులకు హెచ్చరికలు పంపారు. అంతేకాదు ట్విట్టర్లో పెట్టిన పోల్ ను ప్రముఖంగా ప్రస్తావించారు. కెసిఆర్ లాంటి నాయకుడికి ఈ పోల్ లో ఉన్న నిజాలు ఎంత? దీనికున్న పారదర్శకత ఎంత? అనే విషయం తెలుసు. సోషల్ మీడియాలో ఇలాంటి పోల్స్ వల్ల జరిగే ప్రయోజనం కూడా ఉండదని తెలుసు. అయినప్పటికీ కూడా సోషల్ మీడియా ప్రభావం తెలుసు కాబట్టి కెసిఆర్ ఆ విషయాన్ని పదే పదే ప్రస్తావించారు. కానీ సోషల్ మీడియా గొప్పతనాన్ని.. దానివల్ల ఉన్న ఉపయోగాన్ని కాంగ్రెస్ పార్టీ గుర్తించలేకపోతోంది. అందువల్లే అధికారంలో ఉన్నప్పటికీ తన సోషల్ మీడియా విభాగాన్ని బలోపేతం చేసుకోవడంలో పూర్తిగా విఫలమవుతోంది. చివరికి భారతీయ జనతా పార్టీ కూడా సోషల్ మీడియాలో అత్యంత బలంగా ఉంది. యూట్యూబ్ ఛానల్స్, వెబ్ సైట్లు ఇతరత్రా వాటితో భారతీయ జనతా పార్టీ తనకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటున్నది. జాతీయ అంశాలు, రాష్ట్రీయ అంశాలకు ఇందులో ప్రాధాన్యమిస్తుంది. ఇక భారత రాష్ట్ర సమితి కూడా తనకు అనుకూలంగా ఎన్నో యూట్యూబ్ ఛానల్స్ ను మలచుకుంది..వెబ్ సైట్ ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక ట్విట్టర్ హ్యాండిల్స్ అయితే కొన్ని వందల ఖాతాలు ఉన్నాయి.

వీటన్నిటిని కూడా భారత రాష్ట్ర సమితి చాలా తెలివిగా నిర్వహిస్తున్నది. సోషల్ మీడియాలో ఎంత గాలి పోగేయాలో.. అంతలా చేస్తోంది.ఇటీవల నిర్వహించిన పోల్ వల్ల కాంగ్రెస్ పార్టీకి తీవ్రమైన నష్టం జరిగింది. అయినప్పటికీ ఆ పార్టీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించడం లేదు. పైగా ఏదో జరిగిపోయింది అన్నట్టుగా ఉంటుంది. అయితే ఇప్పుడు సోషల్ మీడియా చైర్మన్ ను మార్చుతారని.. మరో కొత్త వ్యక్తిని నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ గనుక ఇదే జరిగితే భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా ముందు ఓడిపోయినట్టు కాంగ్రెస్ ఒప్పుకోవాల్సి ఉంటుంది.. దీనిని భారత రాష్ట్ర సమితి మరింత బలంగా ప్రచారం చేసుకుంటుంది.. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా తల వంపులకు గురికావాల్సి ఉంటుంది.

## ప్రయాగ్ రాజ్ లో వైభవంగా శ్రీ శ్రీనివాస కళ్యాణం

తిరుమల : మహా కుంభమేళా సందర్భంగా ప్రయాగ్ రాజ్ లోని సెక్టార్-19లో గల ఇస్కాన్ క్యాంపులో గురువారం శ్రీ శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది.ముందుగా అర్చక బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ స్వామి వారి ఉత్సవర్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు.అనంతరం ఉదయం 11 నుండి 12 గంటల వరకు అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణ ధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మహా సంకల్పం, మాంగళ్య పూజ, మంగళ సూత్రధారణ మొదలయిన ఘట్టాలతో శాస్త్రోక్తంగా శ్రీ స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు.చివరిగా శ్రీ స్వామి అమ్మవార్లకు నక్షత్ర హారతి, మంగళహారతి సమర్పించడంతో కల్యాణం దిగ్విజయంగా ముగిసింది. శ్రీవారు, అమ్మవార్ల కల్యాణ ఘట్టాన్ని నేత్రపర్వంగా తిలకించిన భక్తులు భక్తి పరవశంతో పులకించారు.

వేద న్యూస్





## వార్డ్ ప్రజలకు రుణపడి ఉంటాను

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిలర్‌గా 5 సంవత్సరాలు విజయవంతముగా పూర్తి చేసుకొని మిర్యాలగూడ మున్సిపాలిటీలో హనుమాన్ పేటను అన్నిరకాల అభివృద్ధి చేసి మిర్యాలగూడ పట్టణంలో ఆదర్శంగా నిలిపి హనుమాన్ పేటకు పట్టణంలో మంచి గుర్తింపు తెచ్చిన కౌన్సిలర్ చిలుకూరి రమాదేవిశ్యామ్‌లను సాయిబాబా గుడి కమిటీ సభ్యులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రమాదేవిశ్యామ్ మాట్లాడుతూ తనకి కౌన్సిలర్ గా గొప్ప అవకాశం ఇచ్చి నన్ను వెన్నంటే ఉండి నడిపించిన మన వార్డు ప్రజలకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వారికి భవిష్యత్తులో మరిన్ని సేవలు చేయడానికి ఎప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడి కమిటీ సభ్యులు, వార్డు పెద్దలు పద్మశెట్టి కోటేశ్వరరావు, కూరపాటి సాంబాశివారావు, గోబ్బురి పద్మ, పెండ్యాల పద్మ, పాపిరెడ్డి,సైదులు,రామారావు సాయి, మహేష్‌లు ఘనంగా సన్మానించడం జరిగింది.



## ఎమ్మెల్యేను కలిసిన టీఎస్ జేయు నాయకులు

**వేద న్యూస్, జగిత్యాల :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కోరుట్ల నియోజకవర్గం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్( టీఎస్ జెయు) అధ్యక్షుడు జోరిగే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ను యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి జర్నలిస్ట్‌లు అని కొనియాడారు.నూతనంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ ఎస్ జె యు )కోరుట్ల నియోజకవర్గ కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దీకొండ మురళి, ప్రధాన కార్యదర్శి తరి రాజశేఖర్, కోశాధికారి ఓంకారి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్ హుస్సేన్, ఈసీ మెంబర్ గట్ల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్ రావు,మాజీ కౌన్సిలర్ ఎనుగందుల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ పీసు తిరుపతి రెడ్డి, బి అర్ ఎస్ నాయకులు గుండవేణి ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



## కులగణన రిపోర్ట్ ను పున:సమీక్షించాలి

- జాజుల లింగం గౌడ్
- అంబేద్కర్ విగ్రహానికి వినతి సమర్పించిన బీసీ నేతలు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సమగ్ర కులగణన రిపోర్ట్ ను వ్యతిరేకిస్తూ దీనిని పున: సమీక్షించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి సమర్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన సర్వే పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని అన్నారు. కులగణ సమగ్రంగా,సంపూర్ణంగా,శాస్త్రీయంగా ఎక్కడా జరగలేదని అన్నారు. బీసీల లెక్కను తక్కువ చేసి,అగ్రకులాల జనాభాను ఎక్కువ చూపారని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించి ఇప్పుడేమో డొంకతిరుగుడు మాటలు చెబుతూ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు మేము ఇస్తామని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే కులగణనలో జరిగిన తప్పులను సరిచేయాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ,దోనేటి శేఖర్, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో గల కమలాపూర్, వంగపల్లి, గూడూరు, దేశరాజు పల్లి ఏజీయల్, శనిగరం సబ్ స్టేషన్ పరిధిలో గల శనిగరం, గోపాల్ పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల గ్రామాలలో రెండవ శనివారం రోజున సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడుతుందని, కావున ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు, రైతులు ఇందుకు సహకరించాలని కమలాపూర్ ఏఈ రాములు ప్రకటనలో తెలిపారు.






# గానకోకిల 'పద్మజ'

- ఇష్టమైన 'గానాన్ని' వదిలిపెట్టకుండా సాధన
- గాయనిగా నాలుగు దశాబ్దాలుగా అలరిస్తున్న సింగర్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

చాలా మంది చిన్న'నాట' తమకు ఉన్న ఆసక్తిని కాలక్రమంలో వదిలేస్తుంటారు. కానీ, ఆమె మాత్రం అలా చేయలేదు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సంగీతంలో ఓనమాలు నేర్చుకుని.. సాధనతో సింగర్‌గా రాణిస్తున్నారు. ఓవైపు వృత్తి బాధ్యతలు, మరోవైపు తనకిష్టమైన గానం.. ఈ రెండింటికీ సమన్వాయం చేస్తోంది. ప్రభుత్వ వసతి గృహ సంక్షేమాధికారిగా చిన్నారుల భవితవ్యాన్ని మోస్తూనే తెలుగు, హిందీ పాటలను తన మృదువైన గొంతుతో పాడుతూ ప్రతిభను చాటుతోంది. రెండేండ్లప్పుడు పాఠశాలలో పాడిన పాట ఆమెకు అమితమైన గుర్తింపు తెచ్చింది. నాలుగు దశాబ్దాలుగా అదే స్వరంతో గాన కచేరీలూ, ఆర్కెస్ట్రాలు, పలు ప్రదర్శనలు ఇస్తూ శ్రోతలను అలరిస్తోంది. ఆమె ఎవరంటే.. పాటల్లో కోకిలమ్మ.. ఎల్కతుర్తి జ్యోతిబాపూలే స్కూల్ హాస్టల్ వార్డెన్ పద్మజ.

### బాల్యంలోనే ఆమెపై సంగీత ప్రభావం

పద్మజ స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వేములవాడ. ఆమె తండ్రి ఆదినారాయణ సాహిత్యకారుడు తల్లి ఈశ్వరమ్మ. గాయని పద్మజ ప్రాథమిక, సెకండరీ విద్య వేములవాడ, ఇంటర్ కరీంనగర్, డిగ్రీ సిద్దిపేట, బీఎడ్ చెన్నయ్‌లో చేశారు. సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం కనుక ఆమెపై సహజంగానే వారి ప్రభావం పడింది. చిన్నప్పటి నుంచే పాటల్లో రాణిస్తున్న బిడ్డను గుర్తించిన తల్లింద్రులు రాజేశ్వరి వద్ద సంగీతంలో శిక్షణ కూడా ఇప్పించారు. ఓ వైపు సంగీతంలో ఓనమాలు నేర్చుకుంటూనే మరో వైపు చదువును యథాతథంగా కొనసాగించారు. అనంతరం ఉద్యోగ బాధ్యతల్లోకి 1998లో సంక్షేమాధికారిగా వచ్చారు. కేశవపట్నం, రామగుండం, హుజూరాబాద్, వీణవంక మండలాల్లో పని చేశారు. ఓ వైపు పాటలు పాడుతూనే మరో వైపు తన వృత్తి బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. విద్యార్థుల పట్ల ఆమె కనబరుస్తున్న శ్రద్ధకుగాను అప్పటి హెూంమంత్రి సబితాఇంద్రారెడ్డి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ అధికారిణిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ఆవార్డు, సత్కారం పొందారు. పద్మజకు ఆమె భర్త రవీందర్ చేదోడు వాదోడుగా నిలుస్తుండటం విశేషం.



### అవార్డులు.. ప్రశంసలు..

పద్మజకు తెలుగు, హిందీ పాటలంటే చాలా ఇష్టం. ఇప్పటి వరకు వెయ్యి వరకు ప్రదర్శనలు ఇచ్చారు. కన్నడ నుంచి తెలుగుకు డబ్బింగ్ అయిన ఐదు సినిమాలకు పాటలు పాడారు. 2006 సంవత్సరంలో రామకృష్ణ ప్రొడక్షన్ వారు పద్మజకు 'గాన కోకిల' బిరుదును ఇచ్చారు. ప్రదర్శనలో సంగీత దర్శకుడు మాధవపెద్ది సత్యం ఆమె పాటలకు పరవశించి స్వయంగా తానే స్టేజీమీద సత్కరించాడు. విజయవాడలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనల్లోనూ ఆమె ప్రత్యేక ప్రశంసలు పొందారు. ఏటా రాగ కల్చరల్ అకాడమీ కరీంనగర్ వారు నిర్వహించే పాటల కార్యక్రమంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా అలనాటి గీతాలపై పాడిన పాటలు ఆమెకు అద్భుతమైన పేరు, ప్రఖ్యాతులు తీసుకొచ్చాయి.





# విజ్ఞాన విహార యాత్రలతో జ్ఞాన సముపార్జన

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పిఎం శ్రీ పథకం ఎక్స్పోజర్ విజిట్ లో భాగంగా విజ్ఞాన విహార యాత్రకు తరలి వెళ్లారు. విద్యార్థులకు కేవలం పాఠశాల విద్య ద్వారానే విద్యను బోధించకుండా ఇటువంటి విజ్ఞాన విహారయాత్రలకు తీసుకువెళ్లడం వలన క్షేత్రస్థాయిలో వాస్తవ స్థితిగతులు వారి కళ్ళతో ప్రత్యక్షంగా చూడటం వల్ల జ్ఞాన సముపార్జన జరిగి విద్యార్థులకు మంచి అవగాహన ఏర్పడుతుందని ప్రిన్సిపల్ డా. జి అనిత తెలిపారు.

గురువారం రోజున కళాశాల నుండి బయలుదేరి వెళ్లిన విద్యార్థిని విద్యార్థులు మొదటి రోజు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటిపిపి) ను సందర్శించి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ గురించిన సమాచారం అంతా అక్కడున్న వారిని అడిగి కొంతమేరకు ఒక అవగాహన తెచ్చుకున్నారు. ఆ తదుపరి ప్రపంచ ప్రసిద్ధ చారిత్రక కట్టడంగా, చారిత్రక ప్రదేశంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించి ఆ చారిత్రక కట్టడం యొక్క శిల్పకళా నైపుణ్యాలను, కాకతీయ రాజుల కాలం నాటి కాకతీయ కళావైభవాన్ని ప్రత్యక్షంగా చూడటం, ఆ కాలం నాటి కళాకారుల నైపుణ్యం ఎంత గొప్పదో విద్యార్థులు అర్థం చేసుకున్నారు. అనంతరం మేడారంలోని గిరిజన మ్యూజియం ను సందర్శించి గిరిజన దేవతలైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని వారి యొక్క వీరోచిత పోరాటాలను, వారి జీవిత చరిత్రను తెలుసుకున్నారు. పీఎం శ్రీ పథకం లో భాగంగా విజ్ఞాన విహారయాత్రకు వెళ్లిన వారిలో కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు
# రైతులు సహకరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూ సేకరణపై రైతుల ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి గ్రీన్ ఫిల్డ్ ఎక్స్ప్రెస్ హైవే ఏర్పాట్లు భూ సేకరణకై గీసుగొండ మండలం ఉకల్, మచ్చాపూర్, గ్రామాలకు చెందిన రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు తమ భూములను అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసిల్దార్ రియాజుద్దీన్, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, టీం లీడర్ సంపత్ కుమార్, పర్యవేక్షకులు శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.



# ఫుడ్ పాయిజనింగ్..
## పలువురు విద్యార్థులకు అస్వస్థత

**వేద న్యూస్, మహబూబాబాద్:**



తెలంగాణలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. తాజాగా మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు మండలం దామరవంచ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. గురుకుల పాఠశాలలో చదువుతోన్న 16 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో.. అందులో నలుగురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో గురుకుల పాఠశాల సిబ్బంది వెంటనే స్పందించి.. వారిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నారు.

ఈ పాఠశాలలో మొత్తం 500 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. గురువారం సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ ఇచ్చే సమయంలో బొబ్బర్లు పెట్టారు. అవి తిన్న విద్యార్థులు.. గత అర్థరాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు కావడంతో.. తీవ్ర అస్వస్తతకు వారు గురయ్యారు.

దీంతో పాఠశాలలోని ఏఎన్ఎం వెంటనే మందులు ఇచ్చింది. అయితే 16 మందిలో నలుగురు పరిస్థితి కొంత తీవ్రంగా మారడంతో.. వారిని గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073